క్లుప్తంగా

నెట్టికంటుడి సేవలో బళ్లారి ఎమ్మెల్యే



గాలి సోమశేఖరరెడ్డిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

గుంతకల్లు రూరల్: బళ్లారి ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభమైన నేపథ్యంలో గాలి సోమశేఖరరెడ్డి తన నామినేషన్ పత్రాలను శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు గాలి సోమశేఖరరెడ్డికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

పాన్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

తాడిపత్రి టౌన్: ప్రభుత్వ పెన్షన్‌దారులందరూ తమ పాన్‌కార్డుకు ఆధార్‌కార్డును అనుసంధానం చేసుకోవాలని తాడిపత్రి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి ఓ ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ పెన్షనర్ అనుసంధానం చేసుకోవాలని, లేకపోతే రూ.1000 జరిమానా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్న కార్మికులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శనివారం మున్సిపల్ వాటర్ వర్క్స్ సిబ్బంది తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్ పర్సన్ బిందె వరలక్ష్మి, పద్మలత, కౌన్సిలర్ నరేష్ పనులను పర్యవేక్షించారు. మరమ్మతు పనులను వేగవంతంగా, నాణ్యత ఉండేలా చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నేడు కంటి వైద్య శిబిరం

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్‌లోని ఆర్వీ స్వామి కల్యాణ మండపంలో ఆదివారం బెంగళూరు శంకర్ కంటి ఆస్పత్రి, తాడిపత్రి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు చంద్ర శేఖర్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. శస్త్ర చికిత్సకు ఎంపికైన వారికి బెంగళూరు శంకర్ కంటి ఆస్పత్రిలో కంటి ఆపరేషన్ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

తప్పిన ప్రమాదం

పామిడి: పాగరూరు వద్ద శనివారం జరిగిన జీపు బ్రిడ్జిని ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. పోలీసుల వివరాల మేరకు.. తగరకుంట గ్రామానికి చెందిన రమేష్, రాజు, రమణ పని మీద చిలుకలూరిపేటకు వెళ్లి తిరుగుపయమనమన్నారు. పాగరూరు వద్ద శనివారం వేగంగా వస్తున్న జీపు బ్రిడ్జిని ఢీకొంది. ఘటనలో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

వన్యప్రాణుల వేట నేరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గార్లదిన్నె: వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు. శనివారం మర్తాడు,పెనకచెర్ల, శింగనమల మండలం తరిమెలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలు, వన్య ప్రాణుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైన వన్యప్రాణులను వేటాడి చంపినా, అడవులకు నిప్పుపెట్టినా వారిపై నాన్ బెయిల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అటవీశాఖ అధికారులు నీలవేణి, తేజేశ్వర్‌రెడ్డి, జగదీష్, రామ్మోహన్, రమేష్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభ విజయవంతం చేయండి

యల్లనూరు: నార్పలలో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి కోరారు. ఈమేరకు శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం సభకు మండలం నుంచి పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు.

బీఫార్మసీ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ)పరిధిలో నిర్వహించిన బీఫార్మసీ సెకండియర్ మొదటి సెమిస్టర్ (ఆర్-19) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ కేశవ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి. చంద్రమోహన్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

బడుగుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. స్థానిక 34వ వార్డు పరిధిలోని జూటూరుకాలనీ, వాంబే కాలనీలో శనివారం ఉదయం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. పెద్దపప్పూరు రోడ్డు సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పూల రూప, వైఎస్సార్ సీపీ నేత పూల బాలరాజుతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వికలాంగులు, మహిళలు, యువకులను పేరు పేరునా పలకరిస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. పింఛన్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని స్థానికులు కోరగా సమస్యలను పరిష్కరించాలని సచివాలయ సెక్రటరీలను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగనన్న పాలన చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నాడు-నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు రూపు రేఖలు మారిపోయాయన్నారు. వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో వచ్చాయన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జాన్సన్, కౌన్సిలర్లు రంగనాథరెడ్డి, రాఘవేంద్ర, ఆకుల చిన్న నాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు బాబు, వరదలయ్య, విజయభాస్కర్, సాయి, నాయకులు శివయ్య, నరసింహారెడ్డి, దివాకర్, బాబయ్య, జావీద్, ఆలీబాషా, శ్రీనివాసులు,పేరం ప్రతాపరెడ్డి, కేశవరెడ్డి, నాగభూషణం, దూలరఘు, సుబ్బారెడ్డి, సునీల్, వేణు, మాబాషా(ఘూరా), మున్సిపల్ డీఈ వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.





సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రతి కుటుంబంలో ఆనందం

యాడికి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శనివారం చందన గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయం యూనిట్‌గా అర్హులందరికీ పథకాలు అందజేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అయినా ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారంతో బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ వారికి మాత్రమే పథకాలు అందజేసేవారన్నారు. ప్రస్తుతం వర్గం, పార్టీ, కుల మతం భేదం లేకుండా అర్హులందరికీ పథకాలు వర్తింపజేస్తున్నట్లు వివరించారు. అనంతరం గ్రామ వలంటీర్లు, గృహ రథసారథులతో ఎమ్మెల్యే మాట్లాడారు. చందన పంచాయతీలో జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని వివరిస్తూ స్టిక్కర్లను లబ్ధిదారుడి గృహం వద్ద అతికించాలని ఆదేశించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, బ్రహ్మానంద రెడ్డి, నాయకులు ఆదిరంగారెడ్డి, వెంకటరామిరెడ్డి, శివకేశవరెడ్డి, నాగరాజు, రామాంజనేయులు, రాంబాబు, దేవరాజ్, ఉదయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఇమాంపురం, కదిరిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ ఏదైనా కారణంచేత పథకాలు అందని వారు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు తెలియజేశారు. సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రారంభించి ఇంటివద్దకే పాలనను తీసుకొచ్చిందన్నారు. వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి నేరుగా ఇంటివద్దకే సంక్షేమ పథకాలు చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని ప్రజలకు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మన బడి నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. రైతుల కోసం గ్రామాల్లోనే ఆర్బీకేలు, ప్రజారోగ్య పరిరక్షణ కోసం సొంత గ్రామాల్లోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకూ ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలిచి రాబోవు ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీడీఓ జామువా, ఎంపీపీ బీబీ మాధవి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మండల ఇంజనీర్ ఓబులేసు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దత్తు, ఏపీఎం రామమూర్తి, సర్పంచ్‌లు రంగన్న, వెంకటలక్ష్మి, మాజీ ఎంపీటీసీలు గోవిందు, నరోత్తమరెడ్డి, జయరామిరెడ్డి, మండల కన్వీనర్ మోహన్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ గోవిందు నాయక్, కోఆప్షన్ సభ్యుడు సిపాయిబాషా, సురేంద్ర, రాజన్న, కదిరిపల్లి మాజీ సర్పంచ్ ఓబుళరెడ్డి, రాము, మధు, రాఘవ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం

ఇమాంపురం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వద్ద పెద్ద గోవిందు అనే వ్యక్తి తన అనారోగ్య సమస్యను తెలియజేశాడు. దీంతో ఆ వృద్ధ దంపతులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం అందించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తాడిపత్రి టౌన్: పట్టణంలోని 34వ వార్డు నందలపాడులో ఆదివారం ఉదయం 7:30 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరగనుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష స్పందన



పసులూరులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: ప్రభుత్వం అర్హులైన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. శనివారం పసులూరులో సచివాలయ కన్వీనర్లు, కో కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి జగనే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కల్పన, సచివాలయ మండల కన్వీనర్ బయపరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బుల్లే నారాయణస్వామి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.
యల్లనూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిషత్తు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మండలవ్యాప్తంగా శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వలంటీర్లు, గృహసారథులు ఇంటింటా తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సెల్‌ఫోన్లు, ఇంటి తలుపులకు జగనన్న స్టిక్లర్లను అతికించుకున్నారు. వలంటీర్లు పెద్దిరాజు, గురుచంద్ర, సురేష్, లక్ష్మి , వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
యాడికి: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్య క్రమాన్ని నిర్వహించారు. తిమ్మాపురం గ్రామ సచివాలయ కన్వీనర్ శివరామిరెడ్డి, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు.

బాధితులకు పరామర్శ

యాడికి: ఇటీవల తాడిపత్రి మండలం బొందలదిన్నె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తూట్రాళ్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత జయరామిరెడ్డిని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం పరామర్శించారు. రాయలచెరువులో వైఎస్సార్‌సీపీ నేత సుబ్బయ్య భార్య లక్ష్మీదేవి నెల క్రితం గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద ఉంటోంది. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆమెను పరామర్శించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రాముడి గుడికి రూ.లక్ష విరాళం

రెండు నెలల క్రితం లక్షుంపల్లెలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామంలో నిర్మిస్తున్న కోదండరామాలయ నిర్మాణానికి ప్రజలు ఆర్థిక సాయం అడిగారు. చందనలో శనివారం ఎమ్మెల్యే లక్షుంపల్లె నాయకులకు ఎమ్మెల్యే రూ.1 లక్ష అందజేశారు. దీంతో లక్షుంపల్లె సర్పంచు పద్మనాభరెడ్డి, నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి, విజయ్, బలరాముడు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పంట నమోదు తప్పక చేయించుకోండి



మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

బుక్కరాయసముద్రం: రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండన్న అధ్యక్షతన సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ హాజరై మాట్లాడారు. వ్యవసాయ పథకాలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలన్నారు. డ్రిప్పు పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు త్వరగా పరికరాలు అందించాలన్నారు. అనంతరం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఆర్బీకే సిబ్బందికి మట్టి నమూనాలను సేకరణపై అవగాహన కల్పించారు. సేకరించి మట్టిని ల్యాబ్‌కు పంపారు. సర్పంచ్ పార్వతి, స్పెషల్ ఆఫీసర్ పిన్నేశ్వరి, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి శైలజ, ఎంఐఏఓ హరిత, బుల్లే నారాయణస్వామి, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.
గుత్తి రూరల్: ధర్మాపురం గ్రామంలో ఆర్బీకేల సిబ్బందికి భూసార పరీక్షలపై శిక్షణ ఇచ్చారు. శనివారం గ్రామ శివారులోని ఓ రైతు పొలంలో ఏఓ ముస్తాక్ అహ్మద్ భూసార పరీక్షలు ఏలా చేయాలి అని క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు మేరీ, షారోన్, వీహెచ్ఏ అజయ్, వీఏఏ నాగేంద్ర పాల్గొన్నారు.
పామిడి: స్థానిక ఆర్బీకేలో శనివారం మండల వ్యవసాయ సిబ్బందికి భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఏఓ డీ లీనా వసుంధర భూసార పరీక్షలు ఎలా చేయాలి, మట్టి నమూనాలు ఎలా సేకరించాలో తెలియజేశారు. ఇదిలా ఉండగా పామిడి పొలాల్లో శనివారం ఏఓ డీ లీనా వసుంధర, డీఆర్‌సీ ఏఓ శంకర్‌లాల్, సిబ్బందితో కలిసి మట్టి నమూనాలు సేకరించారు.

పెళ్లి పేరుతో మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు

గుంతకల్లు రూరల్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడిన సెహ్వాగ్ అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్లు శనివారం రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు. వివరాలు.. గుంతకల్లు శివారులోని దోనిముక్కల ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న 20 ఏళ్ల యువతికి ఆమె దూరపు బంధువైన కణేకల్లు మండలం, హనకనహాళ్‌కు చెందిన ఎల్లప్ప కుమారుడు సెహ్వాగ్ పెళ్లి పేరుతో దగ్గరయ్యాడు. ఈక్రమంలో ఆమెను బలవంతంగా అత్యాచారం చేశాడు. దీంతో బాధితురాలి రూరల్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు నిందితుడిపై ఐపీసీ 420, 376, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆకట్టుకున్న ఫైర్ విన్యాసాలు



అశోక్ పిల్లర్ వద్ద నీటి విన్యాసం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



మంటలు ఆర్పే విధానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం అగ్నిమాపక సిబ్బంది నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అశోకపిల్లర్, యల్లనూరు రోడ్డు సర్కిల్ వద్ద విన్యాసాలు చేపట్టారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది అగ్ని, నీటి ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ప్రమాదాల నివారణపై అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్నిమాపక శాఖ అధికారి మోహన్‌బాబు, సిబ్బంది రామయ్య, రామాంజనేయులు, నవీన్, షకీల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు: స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, ఎస్ఎల్వీ థియేటర్ వద్ద శనివారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపక జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కేపీ లింగమయ్య ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమో ద్వారా అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వస్తే ఏవిధంగా ఆపాలి, అపార్టుమెంట్స్‌లో విద్యుత్ ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌ల దోపిడీ అరికట్టాలి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లలో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని అడిషనల్ డీఎంహెచ్ఓ, జిల్లా నోడల్ అధికారిణి డాక్టర్ సుజాతను ప్రజారోగ్య దోపిడీ నిరోధక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు హరిప్రసాద్ యాదవ్ కోరారు. శనివారం అనంతపురంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో అడిషనల్ డీఎంహెచ్ఓకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ మానవత్వాన్ని మరిచిన కొందరు ప్రైవేట్ వైద్యులు సంపాదనే ధ్యేయంగా వైద్య వృత్తిని కొనసాగిస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న నర్సింగ్‌హోంలను ఆకస్మికంగా తనిఖీ చేసి దోపిడీకి పాల్పడుతున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

సబ్సిడీ టార్పాలిన్ల పంపిణీ



రైతులకు పట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఏఓ

శింగనమల: జాతీయ ఆహార భద్రతా పథకం కింద సబ్సిడీతో అందిస్తున్న టార్పాలిన్ పట్టలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఆదినారాయణ తెలిపారు. శనివారం సలకంచెర్వు రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీ టార్పాలిన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు వచ్చిన తర్వాత రైతులకు నేరుగా సంక్షేమ పథకాలు, ఎరువులు అందిస్తున్నామన్నారు. ఏఓ చిన్నమ్మ మాట్లాడుతూ రైతులు తమ భూములకు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. దానికి అనుగుణంగా ఎరువులు, మందులు వేసుకోవాలన్నారు. గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, వ్యవసాయ సిబ్బంది రాజారెడ్డి, రాజేశ్వరి, జయలక్ష్మి పాల్గొన్నారు.

సజావుగా పదో తరగతి పరీక్ష

యాడికి: మండలంలో పరీక్ష 4 కేంద్రాల్లో శనివారం పదో తరగతి సోషల్ పరీక్ష సజావుగా జరిగింది. మొత్తం 815 మందికిగాను 801 మంది హాజరైనట్లు మండల విద్యాధికారి కాశెప్ప తెలిపారు.
పెద్దవడుగూరు : మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, సరస్వతి హైస్కూల్‌లో శనివారం పదో తరగతి సోషల్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 473 మందికి గాను ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ రాముడు తెలిపారు.

ఏపీ అభివృద్ధిపై మోదీ శీతకన్ను

గుంతకల్లు: రాష్ట్ర అభివృద్ధిపై ప్రధాని మోదీ శీతకన్ను వేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ ఆరోపించారు. మోదీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగం శనివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రత్యేక హోదా, పోలవరం రాజధాని నిర్మాణానికి నిధులు విడుదల చేయలేదన్నారు. రైల్వేజోన్ సంబంధించి ఎలాంటి కార్యచరణ చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, పట్టణ, మండల కార్యదర్శులు గోపినాథ్, రాము రాయల్, నాయకులు ఎస్ఎండీ గౌస్, రామాంజనేయులు, ఈశ్వరయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం సెమినార్ హాలులో సైబర్ సెక్యూరిటీ అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన హాజరై మాట్లాడారు. సైబర్ సెక్యూరిటీ అంశంపై అధ్యాపకులు నూతన అంశాలను అధ్యయనం చేయాలని కోరారు. రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవానీ, సదస్సు కన్వీనర్ డాక్టర్ కే మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న ఎంపీ రంగయ్య



పడిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే వైవీఆర్, కుటుంబ సభ్యులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, మాజీ చైర్మన్ ఎన్.రామలింగప్ప దంపతులు శనివారం వారి స్వగృహంలో అయ్యప్పస్వామి పడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు, అయ్యప్ప మాలధారులైన గురుస్వాములు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నేత తిప్పేస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరితో పాటు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు నైరుతిరెడ్డి, మైమూన్, కమిషనర్ బండి శేషన్న, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

గుంతకల్లుటౌన్: జగనన్న లేఔట్లల్లో థర్డ్ ఆప్షన్ కింద జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హౌసింగ్ కాంట్రాక్టర్లకు సూచించారు. శనివారం పట్టణంలోని జగనన్న లేఔట్-1లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను కమిషనర్ పరిశీలించారు. లబ్ధిదారులకు ఇప్పటివరకు ప్రభుత్వం జమ చేసిన బిల్లులు, అందజేసిన సిమెంట్ గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికీ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారుల చేత వెంటనే ప్రారంభింపజేయాలని వార్డు అమినిటీ సెక్రటరీలను కమిషనర్ ఆదేశించారు. హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన 33వ వార్డులోని రాజీవ్‌కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన డ్రైనేజీలను పరిశీలించారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందును వడ్డిస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నేత హీరాపురం ఫయాజ్‌బాషా శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణంలోని బౌలీ మసీద్, బండా మసీద్, జామియా మసీద్, రోజా మసీద్, యాసిన్‌వలి తదితర మసీదుల్లో సాయంత్రం 6.45 నిమిషాలకు ముస్లిం మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉపావాస దీక్ష అనంతరం ఆయా మసీదుల్లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ రియాజ్, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాషావలి, ఉపాధ్యక్షుడు మహబుబ్‌బాషా, మున్వర్, జునైద్, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE FIRST ADDITIONAL JUNIOR CIVIL JUDGE, MADANAPLLE
DVC. No. 48 / 2021
Between:
Petitioner : **Dr. B. Sowmya**
//Vs//
Respondents: **A. Kiran Kumar & others**
NOTICE TO 4th RESPONDENT
M. Sangeetha,
W/o. M. Sudharshan, aged 29 years, Kasapuram village, Guntakal Mandal, Anantapur District.
So please take notice that the above matter stands posted to **25-04-2023 at 10-30 AM** for your appearance either in person or through an advocate to answer all points in the above case before the Hon'ble Court, failing which the matter will be decided ex-parte.
(By order of the Court)
P.SOLOMON BHARATH BHUSHAN,
M.A., M.A., B.Ed., M.B.A., M.L.
Advocate, # 3-145-8A-13C,
Prasanth Nagar, 3rd Cross,
Madanapalle-517 325, ✆ 94402 72548.